# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కీలకమైన జాతీయ భద్రతా అంశాలపై చర్చల్లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో 60వ అఖిల భారత్ పోలీస్ డైరెక్టర్ జనరల్స్, ఇన్స్ స్పెక్టర్ జనరల్స్ సమావేశం జరుగుతోంది.
- ❖ పార్లమెంటు శీతాకాల సమావేశాల నేపథ్యంలో రేపు అఖిలపక్ష సమావేశం జరగనుంది.
- ❖ వికసిత్ భారత్ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.
- ❖ తమిళనాడు తీరం వైపుగా దిత్వా తుఫాను కదులుతోందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది.

======================

ఛత్తీస్‌గఢ్ లో జరుగుతున్న 60వ అఖిల భారత పోలీస్ డైరెక్టర్ జనరల్స్, ఇన్‌స్పెక్టర్ జనరల్స్ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలను నయా రాయ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నిన్న ప్రారంభించారు. అంతర్గత భద్రత, వ్యూహాత్మక విధానాలను రూపకల్పన చేసే దిశగా ఈ కార్యక్రమం జరుగుతోంది. అలాగే వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాద నిరోధం, విపత్తు నిర్వహణ, మహిళా భద్రత, పోలీసింగ్‌లో ఫోరెన్సిక్ సైన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం వంటి కీలకమైన జాతీయ భద్రతా అంశాలపై కూడా వివరణాత్మక చర్చలు జరుగుతున్నాయి. “వికసిత్ భారత్, భద్రతా ప్రమాణాలు” అనే ఇతి వృత్తంతో ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారు. అలాగే దేశంలో విశిష్ట సేవలు అందించిన పోలీసులకు, పోలీస్ స్టేషన్లకు పతకాలను ప్రదానం చేస్తారు. హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, హోం శాఖ సహాయ మంత్రులు, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి పోలీస్ డైరెక్టర్ జనరల్స్, కేంద్ర పోలీస్ సంస్థల అధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

======================

పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రేపు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయనుంది. ఉభయ సభల రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు సమావేశం కానున్నారు. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు సజావుగా జరిగేలా చూసేందుకు ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీల సహకారాన్ని ఈ సమావేశంలో కోరనుంది. ఈ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుండి 19వ తేదీ వరకు జరుగుతాయి. కిరణ్ రిజిజు ఢిల్లీలో పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ... అఖిల పక్ష సమావేశంలో ప్రభుత్వం అన్ని పార్టీల అభిప్రాయాలను వింటుందన్నారు. ఈ సమావేశాలను సజావుగా నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఉభయ సభల కార్యకలాపాల్లో పూర్తిగా పాల్గొని శక్తివంతమైన పార్లమెంటరీ వ్యవస్థను సృష్టించడంలో సహాయ పడాలని రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలో లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ఈరోజు జరిగిన 100వ ఫౌండేషన్ కోర్సు ముగింపు కార్యక్రమంలో రక్షణమంత్రి ప్రసంగిస్తూ... అభివృద్ధి చెందిన దేశంగా 2047 నాటికి  వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అయ్యేటప్పటికీ దేశంలోని చాలా మంది మహిళా ఉద్యోగులు క్యాబినెట్ కార్యదర్శి పదవికి చేరుకుంటారని అన్నారు. దేశ  అభివృద్ధికి దోహదపడేందుకు మహిళాశక్తి సిద్ధంగా ఉందని, అవకాశం ఇచ్చినప్పుడు వారు సాధించలేని స్థానం ఏదీ లేదని అన్నారు. దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ప్రయాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో కొనసాగుతున్న నిర్మాణాత్మక సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని, పోటీతత్వాన్ని బలోపేతం చేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుడు వి. అనంత నాగేశ్వరన్ అన్నారు. స్థిరమైన స్థూల ఆర్థిక విధానాల మద్దతుతోనే ఇది సాధ్యమవుతోందన్నారు. జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించిన స్థూల దేశీయోత్పత్తి (GDP) అంచనాలను ఈరోజు విడుదల చేసిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. నూతన కార్మిక కోడ్స్ అమలు, GST పన్నుల హేతుబద్ధీకరణ, వ్యక్తిగత ఆదాయ పన్ను విధానం సడలింపులతో సహా సంస్కరణలు సామర్థ్యం, పోటీతత్వాన్ని పెంపొందించడానికి దోహదపడుతున్నాయన్నారు. స్థిరమైన ద్రవ్యోల్బణం, పెరిగిన ప్రభుత్వ మూలధన వ్యయం, స్థిరమైన సంస్కరణల వేగంతో భారతదేశం ప్రపంచ దేశీయ నష్టాలను సమర్థవంతంగా ఎదుర్కోగల స్థితిలో ఉందని తెలిపారు.  ఈ సానుకూల అంశాలు భారతదేశ GDP వృద్ధి అంచనాలను పెంచుతాయని అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజారోగ్య భద్రతలో భాగంగా కృత్రిమ మేధ (ఏఐ)తో వ్యాధిని గుర్తించే సాంకేతికతను తీసుకువస్తున్నామని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (NCDC) డైరెక్టర్ ప్రొఫెసర్ రంజన్ దాస్ తెలిపారు. ఢిల్లీలో ఆకాశవాణితో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. ఏఐ ఆధారిత నిఘా సాంకేతికతను రాపిడ్ రెస్పాన్స్ మెకానిజంతో అనుసంధానించినట్లైతే సకాలంలో వేలాది మంది ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుందన్నారు. భవిష్యత్‌లో ప్రజారోగ్య వ్యవస్థ భద్రత, అంటు వ్యాధులు, వాతావరణ సంబంధిత ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అనుగుణంగా ఈ సాంకేతికతను తీసుకువస్తున్నామని ఆయన వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను ఉత్తర-వాయువ్య దిశగా ప్రయాణించి రేపు తెల్లవారుజామున ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దీని ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్‌లలో రేపు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. ఒకటి, రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్త అమిత్ కుమార్ వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దిత్వా తుఫాను కారణంగా తమిళనాడులో విమాన, రైలు సేవలు నిలిచిపోయాయి. మరోవైపు తమిళనాడు రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖా మంత్రి తిరు రామచంద్రన్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని అంచనా వేశారు. అనంతరం చెన్నైలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. తుఫాను తీరం దాటిన తర్వాత జరిగిన నష్టాన్ని అంచనా వేస్తామన్నారు. ఐదు బృందాల సహాయ దళాలను విల్లుపురానికి తరలించినట్లు చెప్పారు. అవసరమయితేనే తప్ప ప్రజలు బయటకు వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దిత్వా తుఫాను కారణంగా తీవ్రంగా ప్రభావితమైన శ్రీలంకకు ఆపరేషన్ సాగర్ బంధు పేరిట భారత్ అత్యవసర సహాయాన్ని అందిస్తోంది. భారత వైమానిక దళం 21 టన్నుల సహాయ సామాగ్రిని, 80 మంది సిబ్బందిని, 8 టన్నుల ఇతర సామాగ్రిని ఈ సహాయార్థం కొలంబోకు పంపింది. దిత్వా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సహాయం కోసం ఆహార ఉత్పత్తులు, ఔషధాలను ప్రత్యేక విమానాలలో పంపించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మలేషియా వేదికగా సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్ జరుగుతోంది. అందులో భాగంగా ఈరోజు జరిగిన మ్యాచ్ లో భారత్ కెనడాపై 14-3 తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో భారత్ అద్భుతమైన ప్రతిభను కనబరిచి ఫైనల్స్‌కు చేరుకుంది. భారత క్రీడాకారుడు రాజిందర్ సింగ్ మొదట వరుసగా రెండు గోల్స్ వేయగా.. ఆ తరువాత జుగ్‌రాజ్ సింగ్ నాలుగు గోల్స్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడు వన్డే క్రికెట్ మ్యాచ్‌ల సిరీస్ రేపు ప్రారంభం కానుంది. ఝార్ఖండ్‌లోని రాంచి వేదికగా తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ రేపు జరగనుంది. ఇటీవల టెస్ట్ సిరీస్‌లో ఓటమి పాలైనప్పటికీ కే ఎల్ రాహుల్ సారథ్యంలోని భారత జట్టు ఈ మ్యాచ్ లో విజయం సాధించి ఈ సిరీస్ కు శుభారంభం పలకాలని సిద్ధమవుతోంది.

రేపు మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాలకు జేఎస్‌సీఏ ఇంటర్‌నేషనల్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

======================

======================